క్లుప్తంగా

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు మినీ కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: వ్యవసాయంలో మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించ వచ్చని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జీవీ రాయ్ తెలిపారు. మంగళవారం ధర్మవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారుమడుల్లో రైతులు ముందుగా చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. వరి, మినుమ, కందుల మినీ కిట్లను పలువురు రైతులకు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పోలినాయుడును పరామర్శిస్తున్న కిరణ్ కుమార్

రణస్థలం: మండలంలోని దేవరాపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ మీసాల వెంకటేశ్వరరావు సోదరుడు పోలినాయుడు ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డారు. దీంతో అతడిని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షుడు మజ్జి రమేష్, సర్పంచ్ మీసాల శ్రీనివాసరావు, నాయకులు పెద్దింటి వెంకట స్వామి, మీసాల సత్యనారాయణ, గొర్లె శ్రీను, వల్లూరి శ్రీను, మంత్రి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

గార: మండలంలోని తూలుగు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ ఏఈ పైడి యోగీశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గార, శాలిహుండం, బూరవిల్లి, బోరవానిపేట, పూసర్లపాడు, అంబళ్లవలస, తూలుగు, కొర్ని, కొర్లాం, వత్సవలస పంచాయతీలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.
ఎచ్చెర్ల: మండలంలోని కొయ్యాం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ వైశాఖీ బయో మెరైన్, 11 కేవీ కేపీ నాయుడుపేట, బడివానిపేట, కొయ్యాం, జాలరి కొయ్యాం, నిమ్మవానిపేట, పీకే నాయుడుపేట, అజ్జరాం, కుప్పిలి విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని విద్యుత్ శాఖ ఈఈ యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మరమ్మతులు చేపట్టనున్నామన్నారు. కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు, నియంత్రణ నిమిత్తం ఈ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అఖిల భారత సమ్మె జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ కన్వీనర్ కాంచన

గార: కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 9వ తేదీన జరగనున్న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ జల్లు కాంచన పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాల ఆవరణలో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, స్కీమ్ వర్కర్స్ అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలోని అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, వీవోఏ, ఆటో, భవన నిర్మాణ కార్మికులు, స్కీమ్ వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పి.రమణమ్మ, కె.అప్పన్నమ్మ, పి.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడమే సుపరిపాలనా..?



శ్రీరామమూర్తి

జి.సిగడాం: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేయడమే సుపరిపాలనా అని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండలంలోని దవళపేట గ్రామంలో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రజలకు ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా సుపరిపాలనకు తొలి అడుగు పేరుతో గ్రామాల్లో కూటమి నాయకులు పర్యటించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలను మోసం చేయడమే సీఎం చంద్రబాబు నైజమన్నారు. ఇప్పటికైనా కక్ష సాధింపు చర్యలు పక్కనబెట్టి, సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.

సమ్మె చేస్తున్నా... సర్కారుకు పట్టదా..?

- 50వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె
- పట్టించుకోని అధికారులు, నాయకులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న కార్మికులు
- న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని విన్నపం



చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజలకు మౌలిక సదుపాయాలు, తాగునీరు, కాలువల నిర్మాణం, మరుగుదొడ్ల నిర్వహణ, డెత్, బర్త్ సర్టిఫికెట్ల జారీ వంటి అనేక పనులు చేస్తున్నా తమను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ కార్మికులు, టెక్నికల్, నాన్ టెక్నికల్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఎండను, వానను లెక్కచేయకుండా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా వీరంతా గత 50 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నారు. ప్రతిరోజూ కార్పొరేషన్ కార్యాలయం రోడ్డులో కేంద్రమంత్రి, రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు ప్రయాణం చేస్తున్నా కనీసం పట్టించుకోకుండా వెళ్లిపోవడం అన్యాయమని వాపోతున్నారు. పురపాలక సంఘంలో ప్రజలకు కావాల్సిన అన్ని రకాలు సేవలందిస్తున్నా, తాము బతకడానికి తగిన వేతనం కూడా ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. రెండు రోజుల క్రితం నేరుగా మున్సిపల్ కార్పొరేషన్ సీడీఎంఏ నుంచి కమిషనర్‌కి ఫోన్‌లో సమ్మెను విరమించాలని వారి డిమాండ్లు పరిష్కరిస్తామని చెప్పినా, తమకు లిఖిత పూర్వకంగా హామీ ఇస్తే తప్ప సమ్మె విరమించమని కార్మికులు తేల్చిచెప్పారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద జరుగుతున్న సమ్మెలో ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.శ్యామలరావు, ఆర్.సతీష్, ముఖేష్ యాదవ్, సుగాలి శంకరరావు, మజ్జి శ్రీను, రామారావు, కిషోర్, త్రినాథ, రాఘవ, చంటి, మణి, దేవి, సరస్వతీ, మాధురి, జయశ్రీ, ముఖేష్ యాదవ్, రాజేశ్వరి, కరుణ తదితరులు పాల్గొంటున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఉద్యోగ భద్రత

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉద్యోగ భద్రత కల్పిస్తూ అమల్లోకి తీసుకొచ్చిన ఆప్కాస్ రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తహతహలాడుతోంది. దీంతో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లు అప్కాస్ రద్దు చేస్తే కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ మూడు నెలల క్రితం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగారు. దీంతో ప్రభుత్వం కొంత వెనక్కి తగ్గింది. ఆ తర్వాత వేతనాల చెల్లింపులో వ్యత్యాసాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడానికి చొరవ చూపకపోవడంతో సమ్మె చేపట్టారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో అత్యవసర సేవలైన నీటి సరఫరా, వీధి దీపాలు, పార్కుల నిర్వహణ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితర టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగాల్లో 150 మంది పని చేస్తున్నారు. వీరంతా గత రెండు దశాబ్దాలుగా ఉన్నారు. వీరితో పాటే పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రూ.24,500లను దఫదఫాలుగా పెంచారు. దీనికోసం పారిశుద్ధ్య కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమించి కనీస వేతనాలు సాధించుకోగలిగారు. అదే పద్ధతిలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లకు వేతనాలు పెంచాలంటూ నిరవధిక సమ్మె చేస్తున్నారు.

కార్మికుల డిమాండ్లు ఇవే...

- రిటైర్‌మెంట్ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలి.
- నగర జనాభాకు అనుగుణంగా ఇంజినీరింగ్ కార్మికుల సంఖ్య పెంచాలి.
- పలువురు ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా పెంచి ఇవ్వాలి. సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలి.
- టెక్నికల్ అండ్ నాన్ టెక్నికల్‌కు జీతం రూ.29,200, రూ 24,500లు చేయాలి.
- 15 ఏళ్ల సర్వీసు పూర్తయిన వారందరినీ క్రమబద్ధీకరించాలి.
- ఇంజినీరింగ్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి.
- 55 ఆదివారాలు, 17 దేశ, జాతీయ, రాష్ట్ర పండుగలు 72 రోజుల సెలవులుగా ప్రకటించాలి లేదా వేతనం చెల్లించాలి.
- విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షలు, అంగవైకల్యం చెందినవారికి రూ.5 లక్షలు ఇస్తూ కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలి.
- సీనియారిటీ ప్రాతిపదికన జీతాలు చెల్లిస్తూ, హెచ్‌ఆర్ ప్రాతిపదికన జీతాలు ఇవ్వాలి.
- ఆప్కాస్ రద్దు చేస్తే వెంటనే ఇంజినీరింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి.
- పదవీ విరమణ తర్వాత ఇతర ఉద్యోగుల మాదిరిగా గ్రాట్యూటీతో పాటు కనీస పెన్షన్ రూ.10 వేలు అందించాలి.

పట్టించుకోకపోవడం అన్యాయం



ఇంజినీరింగ్ కార్మికులు 50 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయం. నిరంతరం ప్రజలకు వెలుగులు, తాగునీరిచ్చే మా బతుకుల్లో చీకట్లు నింపుకునే పరిస్థితి వచ్చింది. ఈ రోడ్డులోనే కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు రాకపోకలు సాగిస్తున్నా చూసీచూడనట్లు వెళ్లిపోవడం దారుణం. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి.

– వై.శ్యామలరావు,
శ్రీకాకుళం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు

క్రమబద్ధీకరించాలి



అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గతంలో ఆప్కాస్ ఏర్పాటు చేస్తే దాన్ని రద్దు చేస్తామని చెప్పడం అన్యాయం. ఒకవేళ ఆప్కాస్ రద్దుచేస్తే ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలి. చాలీచాలనీ జీతాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారింది. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని శాంతియుతంగా సమ్మె చేస్తున్నా కనీసం కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. మా డిమాండ్లు పరిష్కరించకుంటే భవిష్యత్‌లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం. పూర్తిగా మేము అందిస్తున్న సేవలన్నీ నిలుపుదల చేస్తాం.

– ఆర్.సతీష్,
ఇంజినీరింగ్ కార్మికుల ప్రధాన కార్యదర్శి

టీడీపీలో ముప్పిడి హైడ్రామా

- పార్టీ పదవికి రాజీనామా చేస్తానని బెదిరింపు



ముప్పిడి సురేష్‌ను బుజ్జగిస్తున్న టీడీపీ పెద్దలు

రణస్థలం: లావేరు మండలం తాళ్లవలసకు చెందిన టీడీపీ లావేరు మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ ఇంటి వద్ద బుధవారం హైడ్రామా నడిచింది. లావేరు మండల పార్టీ పదవికి రాజీనామా చేస్తానని ప్రెస్‌మీట్ ఉందని విలేకరులకు ఆయనే స్వయంగా సమాచారం చేరవేశారు. విషయం తెలుసుకున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, నియోజకవర్గ పరిశీలకుడు అనెపు రామకృష్ణ, సీనియర్ నాయకుడు చౌదరి బాబ్జీ హుటాహుటినా సురేష్ ఇంటికి చేరుకుని బుజ్జగింపులు చేపట్టారు. సురేష్‌తో పాటు తామూ మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని సురేష్ వర్గీయులు ఎంపీ, పరిశీలకుల సమక్షంలో బెదిరించడంతో ఒకింత గందరగోళ పరిస్థితి నెలకొంది. పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని, ఎటువంటి తొందరపాటు నిర్ణయాలు వద్దని నచ్చజెప్పారు.

తెరవెనుక ఉన్నదెవరో..?

ఇటీవల సురేష్ చేస్తున్న పనులకు టీడీపీ కీలక ప్రజా ప్రతినిధి ఒకరు తెరవెనుక ఉండి మోకాలు అడ్డుతున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు సురేష్‌కు అనుకూలంగా ఉన్న వర్గీయులను ఆ ప్రజాప్రతినిధి ఇప్పుడు తన వైపు తిప్పుకుని సురేష్‌కు వ్యతిరేక వర్గంగా తయారు చేశారనే విమర్శ ఉంది. ఇలా గత ఆరు మాసాలుగా సురేష్‌కు, ఆ ప్రజా ప్రతినిధికి మధ్య కోల్డ్‌వార్ కొనసాగుతోంది. ఈ విషయం గత నెల 14న మండల పార్టీ కమిటీ ఏర్పాటు సమావేశంలో బహిర్గతమైంది. మండల పార్టీ అధ్యక్ష పదవిలో కొనసాగకుండా ముప్పిడి సురేష్‌కు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో సదరు వ్యక్తి మరో కొత్తవ్యక్తిని తెరపైకి తెసుకొచ్చాడని బహిరంగంగా విమర్శలు వినిపించారు. అప్పటి నుంచి ఈ కోల్డ్‌వార్ తీవ్ర స్థాయిలో కొనసాగుతోంది. దీంతో మనస్థాపం చెందిన ముప్పిడి సురేష్ పార్టీ పదవికి రాజీనామా చేస్తానని తన వర్గీయులతో సమావేశం ఏర్పాటు చేయడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొనాలి

గార: వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి అరసవల్లి రోడ్డులోని సన్‌రైజ్ హోటల్‌లో జరగనుందని, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ విభాగాల సభ్యులు పాల్గొనాలని మండల పార్టీ అధ్యక్షుడు పీస గోపి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. బాబు షూరిటీ – మోసం గ్యారంటీపై సమావేశం జరుగుతుందని, రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో కార్యక్రమంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తొమ్మిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని భైరి గ్రామం శివారులో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని శ్రీకాకుళం రూరల్ పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు.వీరి వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్లు, రూ.3800 నగదు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నరకానికి నకళ్లు

శ్రీకాకుళం రూరల్ పరిధిలో ఉన్న జగనన్న కాలనీల రహదారులన్నీ నరకాన్ని తలపిస్తున్నాయి. వాకలవలస ప్రాంతంలో వెలసిన రాగోలు అర్బన్ లే అవుట్‌తో పాటు, పాత్రునివలస పరిధిలోని కాలనీ రహదారులన్నీ రోజురోజుకూ అధ్వానంగా మారుతున్నారు. ఈ కాలనీలను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

– శ్రీకాకుళం రూరల్



పాత్రునివలసలో రహదారి సౌకర్యం లేని వైనం..



పాత్రునివలస జగనన్న కాలనీ ప్రధాన రహదారిలో కూరుకుపోయిన ట్రాక్టర్



వాకవలసలో జగనన్న కాలనీకి ప్రధాన రహదారి



అధ్వానంగా ఉన్న వాకలవలస జగనన్న కాలనీ రహదారి

రోటరీ క్లబ్‌కు అవార్డుల పంట



అవార్డులతో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దుర్గారావు, నాగేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్: రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్‌కు అవార్డుల పంట పండింది. ఇటీవల రాజమండ్రిలో నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్‌కు 20 అవార్డులు లభించినట్లు ఆ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కేఎన్‌వీ దుర్గారావు, కె.నాగేశ్వరరావులు బుధవారం తెలిపారు. రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఉత్తమ అధ్యక్షుడిగా కేఎన్‌వీ దుర్గారావు, ఉత్తమ కార్యదర్శిగా కింతలి నాగేశ్వరరావులకు అవార్డులు లభించినట్లు తెలిపారు. ఈ అవార్డులను రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ మల్లా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్ చేతులమీదుగా అందుకున్నట్లు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ 2024–25 సంవత్సరానికి గాను ఎక్కువ మొత్తంలో పోలియో ఫండ్ ఇవ్వడం జరిగిందని, ఎండోమెంట్ ఫండ్ డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్‌లకు హాజరుకావడం, పబ్లిక్ ఇమేజ్ హెల్త్ క్యాంప్స్ పెట్టడం, బేసిక్ ఎడ్యుకేషన్ లిటరసీ ప్రోగ్రాం పెట్టడం, ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం, కమ్యూనిటీ సర్వీసెస్ ప్రోగ్రాం, బ్లడ్ కలెక్షన్ క్యాంప్, యోగా క్లాసుల నిర్వహణ, కస్తూర్బా బాలికలకు బెడ్స్ ఉచితంగా ఇవ్వడం, ఇలా పలు సేవా కార్యక్రమాలు చేసినందుకు గాను 20 అవార్డులు లభించినట్లు వెల్లడించారు. ఈ అవార్డులు లభించినందుకు క్లబ్ సభ్యులు బరాటం భరత్ భూషణం, జి.కన్నబాబు, దేవరాపల్లి వెంకట సత్యనారాయణమూర్తి, క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు.

నాణ్యమైన సేవలు అందించాలి



నిరసన తెలియజేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, బీఎస్ఎన్ఎల్ ఎన్ఎఫ్‌టీఈ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా బీఎస్ఎన్ఎల్ ఈయూ, ఎన్ఎఫ్‌టీఈ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని సంచార భవన్ వద్ద బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా యూనియన్ ప్రతినిధులు మాతల గోవర్ధనరావు, పోలాకి వెంకటరావు, బగాది సూర్యనారాయణ, టి.శ్రీనివాసరావులు మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు నష్టం కలిగే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని, బీఎస్ఎన్ఎల్ సంస్థలో 3వ వేతన సవరణ/పెన్షన్ సవరణ అమలు చేయాలని, సంస్థలో కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. నిరసనలో బీఎస్ఎన్ఎల్ ఈయూ, ఎన్ఎఫ్‌టీఈ నాయకులు పైల మల్లేషు, వి.శ్రీనివాసరావు, దుంపల శ్రీనివాసరావు, అరుణశ్రీ, మూల లక్ష్మి, పోలాకి శారద, చిన్నికృష్ణ, చరణ్, హెచ్.ఢిల్లీశ్వరరావు, ముకుందరావు, సీహెచ్ సింహాచలం, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న డీపీవో సౌజన్య భార్గవి

జి.సిగడాం: గ్రామాల్లో చెత్త సమస్య పరిష్కారానికి ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి సౌజన్య భార్గవి అన్నారు. మండలంలోని ఆనందపురం గ్రామంలో పొడి చెత్త, తడి చెత్త వేరు చేసే విధానంపై ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రజలు, యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇంటింటా సేకరించిన చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. అయితే పంచాయతీల్లో నిధులు లేకపోతే పారిశుద్ధ్య కార్మికులకు ఏవిధంగా జీతాలు చెల్లించాలని గ్రామ సర్పంచ్ చిత్తిరి మంజు డీపీవో వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. బ్లీజింగ్ కొనుగోలు చేయడానికి కూడా నిధులు లేవన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుంటముక్కల రామకృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి జాడ కిషోర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ముంతా హేమంత్‌కుమార్, బాలి లక్ష్మునాయుడు, మోహన్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో విధులు చేపట్టాలి

జి.సిగడాం: గ్రామాల్లో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా సూచించారు. మండలంలోని టంకాలదిగ్గువలస గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న రోగులు వద్దకు బుధవారం వెళ్లి ఆరా తీశారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపడేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో గుంటుకు రామకృష్ణారావుకు సూచించారు. విధి నిర్వహణలో ఎవరూ అలసత్వం వహించవద్దన్నారు. గ్రామంలో బుధవారం నాటికి 11 మందే జ్వరాలతో ఉన్నారని, వీరుకూడా కోలుకుంటున్నారని వైద్యులు వెల్లడించారు. ఆయనతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ యు.కుసుమ, సీహెచ్‌వో సత్యంనాయుడు, సూపర్‌వైజర్లు భాస్కరరావు తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం

రణస్థలం: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు సూచించారు. మండలంలోని కోటపాలెం పంచాయతీలో బుధవారం పర్యటించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వి.ప్రకాష్‌రావు, పంచాయతీ కార్యదర్శి ఆర్.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో ఒరిగిందేమీ లేదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

రణస్థలం: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ప్రచారం కోసమే సుపరిపాలనకు తొలి అడుగు అంటూ చెబుతున్నారని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ కార్యాలయంలో సంచాం గ్రామ పంచాయతీ కార్యకర్తలతో కార్యకర్తే కీలకం సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అరాచకాలు, అక్రమాలు, దోపిడీలు, అన్యాయాలు పెరిగాయని మండిపడ్డారు. మాజీ సీఎం జగన్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే అణిచివేసే ప్రయత్నంలో భాగంగా కుట్ర జరుగుతోందన్నారు. దీనిని ప్రతీ ఒక్క కార్యకర్త బలంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, సంచాం సర్పంచ్ రెడ్డి రాము, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పిల్ల ఆనంద పాత్రో, నాయకులు రెడ్డి ఆనంద్, మీసాల రాము, రెడ్డి రామకృష్ణ, మీసాల దాలినాయుడు, కెల్ల శ్రీను, మీసాల అప్పలనాయుడు, వెంకి నాయుడు, చందక బాలకృష్ణ, దుప్పాడ బంగారి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొనాలి



మాట్లాడుతున్న నానాజీ

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 4, 5 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త ధర్నా కార్యక్రమంలో ఆర్టీసీలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా భాగస్వాములు కావాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.నానాజీ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని ఈయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలతో పాటు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలియజేశారు. ప్రధానంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు యాజమాన్యం ద్వారా వేతనాలు చెల్లించాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను చేర్చాలని తదితర డిమాండ్లను యాజమాన్యం ముందు ఉంచనున్నామన్నారు. రాష్ట్రంలోని 7,300 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఈయూ చేపట్టనున్న ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు టి.ముత్యాలరావు, రాష్ట్ర కార్యదర్శి బి.కుమార్ నాయక్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, కోశాధికారి ఆర్.నవీన్, సభ్యులు అనిల్, రామ్మోహన్, శివ, రాజారావు, వేణుగోపాల్, రాజా, గోపి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.